నేటి నుంచి వార్డు సభలు

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాల నిర్వహణకు పట్టణంలోని 33 వార్డులకు వార్డు ఆఫీసర్లతో పాటు కేంద్రాల జాబితాను సోమవారం మున్సిపల్ కమీషనర్ తిరుపతి ప్రకటించారు. ఈ నెల 21 నుండి 23వతేదీ వరకు నిర్వహించు వార్డు సభల నిర్వహణ కోసం 33 వార్డులలో ఇన్‌చార్జిలను నిర్వహించినట్లు కమీషనర్ తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల లబ్దిదారుల గుర్తించుటకు వార్డులలో సభలను నిర్వహించేందు వార్డు ఇంచార్జులను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నియమించినట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించు సభలలో ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు ఎంపిక జరుగుతుందని ఇట్టి కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొరారు.

●రాయికల్: రాయికల్ మున్సిపాలిటీలో సోమవారం 1వ వార్డు షాదీఖానా, 2వ వార్డు వర్తక సంఘ భవనం, 3వ వార్డు గోసంగి సంఘ భవనంలో వార్డు సభలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. అలాగే 22న 4వ వార్డు సుతారి తిరుపతి ఇంటి ఎదుట, 5వ వార్డు పాత పోలీస్ స్టేషన్ దగ్గర, 6వ వార్డు ఆర్యవైశ్య సంఘ భవనంలో, 23న 7వ వార్డు జైలు గడ్డ దగ్గర, 8వ వార్డు గౌడ సంఘ భవనం, 9వ వార్డు పెగ్గెర్ల లక్ష్మణ్ ఇంటి సమీపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న 10వ వార్డు పద్మశాలి కల్యాణ మండపం, 11వ వార్డు స్వర్ణకార సంఘ భవనం, 12న గుడేటి కాపు సంఘ భవనాల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పురపాలికలకు నిధులు విడుదల





పట్టణ ప్రగతి కింద మంజూరైన నిధులు ఇలా..

మున్సిపాలిటీ పేరు	మంజూరైన నిధులు
జగిత్యాల	- రూ. 81,23,040
ధర్మపురి	- రూ. 13,12,746
కోరుట్ల	- రూ. 56,47,260
మెట్‌పల్లి	- రూ. 47,89,835
రాయికల్	- రూ. 13,57,243
మొత్తం	- రూ. 2,12,30,124

స్టాంప్ డ్యూటీ కింద మంజూరైన నిధులు

మున్సిపాలిటీ పేరు	మంజూరైన నిధులు
జగిత్యాల	- రూ. 11.07 కోట్లు
ధర్మపురి	- రూ. 0.24 కోట్లు
కోరుట్ల	- రూ.7.88 కోట్లు
మెట్‌పల్లి	- రూ. 3.70 కోట్లు
రాయికల్	- రూ. 1.40 కోట్లు
మొత్తం	- రూ. 24.29 కోట్లు

- పట్టణ ప్రగతి, స్టాంప్ డ్యూటీ బకాయిలకు మోక్షం
- వినియోగానికి ప్రత్యేక మార్గదర్శకాలు
- స్టాంప్ డ్యూటీ నిధులు రూ.24.29 కోట్లు
- పట్టణ ప్రగతి నిధులు రూ 2.12 కోట్లు ఖాతాల్లో జమ

● తీవ్ర నిరాశలో పాలకవర్గాలు...

నిధుల వినియోగంపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు అసంతృప్తితో ఉన్నారు. ఈ నెల 27న మున్సిపల్ పాలక వర్గాల గడువు ముగియ నుంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు పెండింగ్ బిల్లుల చెల్లింపులు, వార్డుల్లో చేయాల్సిన పనులకు నిధులకోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. విడుదలైన స్టాంప్ డ్యూటీ నిధులతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకపోవడంతో పాలకవర్గాలు తీవ్ర నిరాశకు గురవుతున్నాయి.

జగిత్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిధులు లేక నీరసించిపోతున్న మున్సిపాలిటీలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి స్టాంపుడ్యూటీ, ఆస్తిమార్పిడి రుసుము నుంచి రావాల్సిన బకాయి నిధులను ఇటీవల విడుదల చేసింది. 2019 నుంచి స్టాంపుడ్యూటీ, 2022 నుంచి ఆస్తి మార్పిడి రుసుము ద్వారా వచ్చిన పన్ను బకాయిల వాటాను జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ప్రత్యేక ఖాతాల్లో జమచేసింది. దీంతోపాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు పట్టణప్రగతి నిధులను సైతం విడుదల య్యాయి. నిధులవ్యయంపై ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీచేసి పలు ఆంక్షలు విధించింది.

● ప్రతి రిజిస్ట్రేషన్‌పై 0.5 శాతం స్టాంప్ డ్యూటీ

మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలు, వాణిజ్య భవనాలు, నివాస భవనాల క్రయ, విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు అయినట్లయితే 0.5 శాతం స్టాంప్ డ్యూటీ ఆయా మున్సిపాలిటీలకు రావాల్సి ఉంటుంది. గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మున్సిపాలిటీల ఖాతాల్లో ఆ మొత్తం జమయ్యేవి. 2019 నుంచి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలకు రావల్సిన స్టాంప్ డ్యూటీ డబ్బులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయి. దీంతో సుమారు అయిదేళ్లుగా స్టాంప్ డ్యూటీ డబ్బులు నిలిచిపోయాయి. ఫలితంగా మున్సిపాలిటీలకు ఆదాయం తగ్గింది. స్టాంప్ డ్యూటీ చెల్లింపులపై మున్సిపల్ చైర్మన్లు ప్రభుత్వానికి విన్నవించడంతో ఇటీవల మున్సిపాలిటీల ఖాతాల్లో ఆ నిధులను జమచేసింది. దీంతో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల,

మిగతా 8లో

రహదారుల విస్తరణకు ప్రాధాన్యం

● ఆర్‌అండ్‌బీ ఎస్ఈ తిరుపతి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జగిత్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల సర్కిల్ కార్యాలయం పరిధిలోని పెద్దపల్లి, జగిత్యాల డివిజన్‌లో రహదారుల విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జగిత్యాల ఎస్ఈ తిరుపతి పేర్కొన్నారు. రహదారుల విస్తరణ, నిర్వహణ, నూతన రహదారుల ఏర్పాటు తదితర అంశాల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ లో వివరించారు.

ఆంధ్రజ్యోతి : రోడ్లు, భవనాల శాఖలో ఏ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు ?

ఎస్ఈ : గత వర్షాకాలం చెడిపోయిన రోడ్లను బాగు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. స్వల్పంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. కొన్ని చోట్ల భారీగా దెబ్బతిన్న రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : కొత్త రోడ్లు నిర్మిస్తున్నారా ?

ఎస్ఈ : సర్కిల్ కార్యాలయం పరిధిలోని పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలో 18 కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. రూ.130 కోట్లతో నిర్మించనున్న రోడ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి : సర్కిల్ పరిధిలో ఎన్ని డివిజన్‌లు ఉన్నాయి ?

ఎస్ఈ : జగిత్యాల సర్కిల్ కార్యాలయం పరిధిలో జగిత్యాలతో పాటు పెద్దపల్లి జిల్లాలో డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రెండు కార్యాలయ పరిధిలో 9 సబ్ డివిజన్‌లు ఉన్నాయి. జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి, జగిత్యాల, రాయికల్, జగిత్యాల పట్టణం, జగిత్యాల భవనాల కార్యాలయం, పెద్దపల్లి జిల్లాలో మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి భవనాల కార్యాలయాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : కార్యాలయాల్లో సిబ్బంది ఎంతమంది ఉన్నారు?

ఎస్ఈ : పెద్దపల్లి జిల్లాలో ఈఈ లేకపోవడం వల్ల డీఈకి బాధ్యతలు అప్పగించాం. 9 సబ్ డివిజన్‌లలో 22 మంది ఏఈలకు గాను 17 మంది ఉన్నారు. ఐదు సబ్ డివిజన్లకు కలిపి ఒక డీఈ ఉన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న పంచాయతీ కార్మికులు

జగిత్యాల అర్బన్/కొడిమ్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బకాయి ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు యూనిఫాంలు, సబ్బులు, నూనెలు ఇవ్వడంతో పాటు పంచాయతీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, సిబ్బంది అందరినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. ఈ నెల 26 లోపు సిబ్బందికి దుస్తులు, సబ్బులు, నూనె ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కమిటీ చంద్రశేఖర్, పులి మల్లేశం, వంగ రాజేశం, కనికారపు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వే పరిశీలన



మల్యాలలో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

8

తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ

8

అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, మురికి కాలువల గురించి, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, నీటి సరఫరా విషయాల గురించి సమీక్షించారు. పలువురు కౌన్సిల్ సభ్యులు వార్డులలో తాగునీటి సమస్యలను దృష్టికి తీసుకురాగా పట్టణంలో అమృత్ 2.0 ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ఇందుకు సంబంధించిన స్థలమును కొనుగోలు చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వార్డులో అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయుటంతో పాటు ఇతర 22 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ మెరాజొద్దీన్, వనిత, పిప్పోజి మహేందర్ బాబు, మేనేజర్ వెంకటి, ఏఈ సీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. రాయికల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, నాగరాజు, తిరుమల, గంగాధర్, వనిత, పద్మ, శివానందం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణానికి చెందిన శ్రీపాద హరీష్ ఆకస్మికంగా మరణించగా సోమవారం రాత్రి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. అలాగే 33వ వార్డుకు చెందిన కల్లెడ రాజయ్య ఇటీవల మరణించగా వారి కుమారుడిని ఎమ్మెల్యే రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు రేణుక మొగిలి కూసరి అనిల్, పిట్ట ధర్మరాజు, ఎనుగుల రాజు, పుల్ల మల్లయ్య, తదితరులు ఉన్నారు.

●మల్లాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. సోమవారం మండలంలోని సిరిపూర్, కుస్తాపూర్, గొర్రెపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, గౌరు నగేష్, నాయకులు బైరి రవికుమార్‌యాదవ్, బైరి రాకేష్‌యాదవ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, శరత్‌గౌడ్, లింగస్వామి, సుద్దు రాజుకుమార్, అమీన్, దేవరెడ్డి, రాజు, సురేష్, రాజారెడ్డి, రవీందర్, ధ్యాగా గంగారెడ్డి, భూమారెడ్డి ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన మారంపెల్లి హర్షిత కడుపులో ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్థోమతలేక ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే రూ.2.50 లక్షల ఎల్‌వోసీని హర్షితకు మంజూరు చేయించారు. సోమవారం రూ.2.50 లక్షల విలువ గల ఎల్‌వోసీని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హర్షిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దూమాల రాజ్‌కుమార్, పేట భాస్కర్, దూడ వెంకటేష్, రాజేశం, పవన్, శెట్టికంగారెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

జగిత్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం నుంచి గ్రామాలలో, మున్సిపల్ వార్డులలో అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. మండలాలలో మరియు మున్సిపల్ వార్డులలో మండలాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. గ్రామ సభలు నిర్వహించుటకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను తెలియజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు బీఎస్ లత, గౌతంరెడ్డి, జిల్లా పంచాయతి అధికారి, డిఆర్డీఓ, డిఎస్ఓ, హౌసింగ్ డీఈ పాల్గొన్నారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ప్రశ్నించడం కాదు..ప్రజలకు సేవ చేయడం ముఖ్యమని అన్నారు. జగిత్యాల పట్టణంలోని 14వ వార్డులో రూ.60 లక్షలు, 15వ వార్డులో రూ.20 లక్షలు, 31వ వార్డులో రూ.20లక్షలు మొత్తం కోటి రూపాయల అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపనలు చేసిన ఆయన 14వ వార్డులో ఎస్సీ కమిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. దళితుల అభ్యున్నతికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. స్వరాష్ట్రం సిద్ధించాక ఎస్సీ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల రాష్ట్రంలోనే జగిత్యాలలో ముందుగా ఏర్పాటు చేశామని, అందులో 240 సీట్లు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పోచమ్మవాడకు వాటర్ ట్యాంక్ మంజూరు అయిందని, పనుల ప్రారంభానికి అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల లక్ష్మి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు కూతురు పద్మ, తోట మల్లికార్జున్, నాయకులు అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, అజార్, కూతురు శేఖర్, ఏఈ శరణ్, ఆయా వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

●జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తిమ్మాపూర్ గ్రామ ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

చెక్కులు అందజేత

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని ఉస్మాన్ బిన్ అఫ్వాన్ మజీద్ అభివృద్ధికి మంజూరు చేసిన 3 లక్షల 71 వేల 288 రూపాయల చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం రాత్రి అందజేశారు. మజీద్ వద్ద కమిటీ సభ్యులకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, పంబాల రాంకుమార్, అబ్దుల్ ఖాదర్, ముజాహిద్, అదిల్ పటేల్, రహీం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల బస్ డ్రైవర్స్‌కు ట్రాఫిక్ నియమ నిబంధనలపై పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్పీ స్వయంగా వాహనాల ఫిట్‌నెస్ తదితర ప్రమాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, డీటీవో శ్రీనివాస్, ఆర్ఐ వేణు, ఎస్సైలు సదాకర్, మల్లేశం, గీత, స్కూల్ వ్యాన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రావు తదితరులు ఉన్నారు.

ఏటీఎంల వద్ద పటిష్ట భద్రత

జగిత్యాల క్రైం: బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న బ్యాంకు అధికారులతో ఏటీఎంల వద్ద భద్రతా ప్రవణాలు, సీసీ కెమారాల ఏర్పాటు తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ హాజరై మాట్లాడుతూ జిల్లా పరిధిలో 129 బ్యాంకులు, 90 ఏటీఎం సెంటర్లు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో భద్రతా సిబ్బందిని తప్పనిసరిగా నియమించాలన్నారు. ఏటీఎంల వద్ద నిరంతరం సెక్యూరిటీ గార్డు, సీసీ కెమారాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు ఫీల్లింగ్ చేసే సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇస్తే బ్లూ కోట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద విధిగా పోలీస్ స్టేషన్ల నంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘుచందర్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ ఆరీఫ్‌అలీ ఖాన్, బ్యాంకు అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

జగిత్యాల క్రైం :ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది అర్జిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



లింగన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన పిట్లం లింగన్న (41) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. లింగన్న ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లి మరునాడు వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. లింగన్న తల్లిదండ్రులకు అనారోగ్య సమస్యలతో చికిత్సకు, పంట సాగుకు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య పిట్ల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



ఆశన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్ గ్రామానికి చెందిన రెబ్బసి ఆశన్న(72) అనే వృద్ధుడు సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆశన్న భార్య రెబ్బసి శాంత మూడు నెలల క్రితం మరణించగా తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మంచంపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కొడుకు రెబ్బసి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నాట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో సోమవారం ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన పదమూడు సంవత్సరాల బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి పారిపోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హైదరాబాద్‌లో పట్టుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పాత అరుణ్‌కుమార్ అనే వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. పదిహేను రోజుల క్రితం అక్రమంగా 1.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైన పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యమైంది. సోమవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. బాలిక మెట్‌పల్లిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల కారణంగా ఇంటి వద్దే ఉంది. ఈ నెల 15న తల్లికి తెలపకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన రాసం రాకేష్ ప్రేమపేరుతో వేధించేవాడని, అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- విపత్తులను ఎదుర్కొనేందుకు 'ఆపద మిత్ర'ల నియామకం
- జిల్లాలో 300 మంది వలంటీర్ల ఎంపిక
- స్థానిక ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవకాశం
- మొదటి దశలో 59 మందికి 12 రోజుల శిక్షణ



అత్యవసర సమయాల్లో అండగా..

కరీంనగర్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవిం చినప్పుడు సరైన సమయంలో సహాయం అందక తీవ్ర నష్టం జరుగుతోంది. సమాచారం అందుకుని ప్రభుత్వ యంత్రాంగం అక్కడికి చేరుకునే ఆలస్యమవుతోంది. ఇలాంటి నష్టాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చే వారికి 'ఆపద మిత్ర' కింద విపత్తులు ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తు న్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు చెందిన జిల్లా అధికారులు వలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పి స్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము కాటు, కుక్కకాటు, అగ్ని ప్రమాదం, విద్యుదాఘాతం, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపద మిత్ర శిక్షణ తీసుకున్న వలంటీర్లు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

● స్థానికులకు ప్రాధాన్యం

ఆపదమిత్రలుగా శిక్షణ తీసుకున్న వారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరకుంటారు. నష్టం జరగకుండా.. బాధితులకు అండగా ఉంటారు. వరదలో చిక్కుకున్న వారు ఉంటే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటారు. అవసరమైన ప్రభుత్వ శాఖలకు ఎప్పటి కప్పుడు సమాచారం అందజేస్తారు. మొదటి దశలో జిల్లాలోని 59 మంది వలంటీర్లకు ఆపదమిత్ర కింద శిక్షణ ఇచ్చారు. స్థానికులకే ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని అధికారులు సూచిం చారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయాల్లో ఆస్తులు రక్షించడం, మనుషులు, జంతువుల ప్రాణాలను కాపా డడం, వరదల్లో కొట్టుకు పోతున్న వ్యక్తిని రక్షించడం వంటి అంశాల్లో శిక్షణ దిగువ మానేరు జలాశయంలో శిక్షణ ఇచ్చారు. తిమ్మాపూర్ మండలం నల్గొండలో నాలుగు ఫైరింజన్‌లతో ఫీల్డ్ ట్రైనింగ్ అందించారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఆపదమిత్ర కోర్స్ కోఆర్డినేటర్ అయిన జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఈ శిక్షణ కొనసాగింది.

● ప్రత్యేక రక్షణ కిట్లు....

మొదటి దశలో శిక్షణ పొందిన 59 మంది ఆపద మిత్రలకు త్వరలోనే ప్రత్యేక రక్షణ కిట్లను అందజేయనున్నారు. ఈ కిట్లలో స్పెషల్ గాగుల్స్, ఫైర్‌ప్రూఫ్ హెల్మెట్, లైవ్‌జాకెట్స్, షూ, రోప్, ఇతర రక్షణకు సంబంధించిన పరికరాలు, వస్తువులుంటాయి. ఈ రక్షణ కిట్లను త్వరలోనే శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలకు అందించనున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు శిక్షణ అందిస్తున్నామని కోఆర్డినేటర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

శునకాల స్వైర విహారం

ఓదెల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గూడెంలో రెండు రోజుల క్రితం రియాన్షు అనే చిన్నారిపై దాడి చేయడంతో మొఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓదెల పొత్కపల్లి, మడకలో రెండు రోజుల క్రితం దాడులకు పాల్పడ్డాయి. సోమవారం నాటు వేయడానికి వెళుతున్న కూలీలపై కుక్కలు కరవడంతో గాయాలకు గురై సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట అనుబంధ గ్రామమైన రామన్నపల్లికి చెందిన బత్తుల మల్లయ్య (28) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మల్లయ్య ఇంటి పనులపై బయటకు వెళ్లి ఇంటికి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. గ్రామ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడిపోగా తలకు గాయాలై మృతి చెందాడు. మృతుడు మల్లయ్య భార్య రేణవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



తెరిచి ఉన్న బీరువా

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. మూడు రోజుల క్రితం ఊరెళ్లిన ఇంటి యజమాని సోమవారం రాత్రి తిరిగి రావడంతో దొంగతనం వెలుగు చూసింది. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వంగల శ్రీనివాస్ భాగ్య దంపతులు మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో సుల్తానాబాద్ వచ్చారు. ఇంటి తాళం తీసి ఉండడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దొంగలు తాళం ఊడదీసి లోపలికి చొరబడి బీరువాలను తెరిచి సామాన్లను కింద పడేశారు. హాల్‌లోని టీవీని ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏ మేరకు చోరీ జరిగిందనేది తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



టీఎన్‌జీవో డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కట్కూరి నాగుల నరసింహ స్వామి, శ్రీకాంత్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, రూరల్ అధ్యక్షుడు వాస్తవిక్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, రామస్వామి, శంకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కామ సతీష్, గిరిధర్‌రావు, శంకర్, మహిళ నాయకురాళ్లు శారద, సునీత, హరిప్రియ, లత, సరిత, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, గాజుల నర్సయ్య, ఎల దాసరి లింగయ్య, రమేశ్, గోవిందపతి శ్రీనివాస్, పత్తేంశ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం

● గేదెపై దాడి ● భయాందోళనలో ప్రజలు



ముస్తాఫానగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. ముస్తాఫనగర్‌కు చెందిన రాసమల్ల రాజు అనే రైతుకు చెందిన గేదెపై దాడిచేసి చంపేసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ అధికారి రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని చిరుతగా అధికారులు నిర్ధారించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పొలాల వద్దకు రాత్రి వేళల్లో రైతు లు వెళ్లొద్దని, కొట్టాల్లో పశువులను ఉంచరాదని రేంజ్ అధికారి కల్పనదేవి సూచించారు.

● మండలంలో వరుస ఘటనలు

గంభీరావుపేట మండలంలో చిరుత సంచరిస్తూ వరుస దాడులకు పాల్పడుతోంది. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ సమీప వ్యవసాయ పొలాల వద్ద ఉన్న గేదెలపై అప్పట్లో చిరుత దాడి చేసి హతమార్చింది. ముచ్చర్ల ప్రాంతంలో రెండు మూడుసార్లు చిరుత దాడులకు తెగబడింది. అదే క్రమంలో గోరంటాల సమీప అడవుల్లో కూడా మేకల మందపై చిరుత దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. మల్లుపల్లె బ్రిడ్జి వద్ద ఇటీవల చిరుత అడవి పంది పిల్లలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో దమ్మన్నపేట సమీప అడవుల్లో చిరుత సంచరించింది. పలు గ్రామాల్లో చిరుత సంచారం అధికమవుతుండటంతో గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్ళేందుకు జంకుతున్నారు. ఒకే చిరుత ఇన్ని గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరిస్తుందా లేక చిరుతల సంఖ్య పెరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

లొట్టి పోయి.. బాటిల్ వచ్చె..



తాటి చెట్టుకు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది. ప్లాస్టిక్ భూతం కల్లు కుండలకు కూడా తాకింది. కుమ్మరి కులస్తులు చేసిన కుండలను కల్లుకోసం తాటి చెట్లకు కడుతుంటారు. మట్టి కుండల తయారీ తక్కువ కావడం, మరో వైపు వాటి ధరలకు కూడా పెరిగిపోవడంతో గౌడ కులస్తులు కొన్ని చోట్ల తాటి చెట్టుకు కుండలకు బదులుగా ప్లాస్టిక్ బాటిల్స్ కడుతున్నారు. సుద్దాల గ్రామ శివారులో తాటిచెట్టుకు కట్టిన వాటర్ బాటిల్స్‌ను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. మార్కెట్‌లో కుండలు లభించక ప్లాస్టిక్ బాటిల్స్ కట్టినట్లు గౌడ కులస్థులు పేర్కొంటున్నారు. వీటిని చెట్లకు కట్టడం సులభంగా ఉందన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.55 వేల ఆస్తి నష్టం





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సోమవారం వేకువజామున జరిగిన రెండు అగ్నిప్రమాదాల సంఘటనల్లో రూ.55 వేల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. కరీంనగర్ శివారులోని తీగలవంతెన సమీపంలోని సోహెల్ హోటల్(దాబా)లో ఉదయం 4:30 గంటలకు మంటలు అంటుకోవడంతో వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది ఫైరింజన్ వాహనంతో వెళ్లి మంటలను ఆర్పివేశారు. హోటల్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని రిఫ్రిజిరేటర్, వంట నూనె, ఇతన ఆహార ముడి పదార్థాలు దగ్ధమయ్యాయని, వాటి విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని హోటల్ యజమాని ఆసిఫ్‌ఖాన్ ఫిర్యాదు చేశాడని అధికారులు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని వీఆర్ఆర్ నగర్‌లో ఇంటి పక్క ఖాళీ స్థలంలో కర్రలకు మంటలు అంటుకొని దగ్ధమమయ్యాయి. ఫైరి సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు 5 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బందుకు శ్రీనివాస్, అతని కుమారుడు నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 19న ఆనందం భార్య పుష్పలత, కొడుకు కరుణాకర్, జగన్‌లు తమ వ్యవసాయ పొలానికి చేరుకోగా శ్రీనివాస్, నరేశ్‌లు అడ్డుకోవడంతో పాటు కర్ర, గడ్డపార, కొడవలితో దాడి చేసి గాయాపరిచారని చెప్పారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో చిట్టి డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి కోమాలోకి పోవడానికి కారణమైన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్య అదే గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ అనే వ్యక్తుల మధ్య చిట్టి డబ్బుల విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ గొడవలో బైక్ పైన ఉన్న సమ్మయ్యను శ్రీనివాస్ కిందకి తోసి తలపై కొట్టడంతో బలమైన గాయమైంది. దీంతో సమ్మయ్య కోమాలోకి పోయా డని అతని భార్య కొలిపాక నిర్మల కల్లూరు శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి సోమవారం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వివాహితను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కటెరపాక దిలీప్ అనే యువకుడు తరచూ వివాహితను వెంబండించడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన తుమ్మ ప్రసాద్ (40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తుమ్మ ప్రసాద్ ద్విచక్ర వాహనంపై శనివారం కనుకుల నుంచి సుల్తానాబాద్ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రసాద్ సోమవారం మృతి చెందారు. మృతుడికి కొడుకు కూతురు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- పెరిగిన వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తుమ్మనపల్లి గ్రామంలో ఇరుకుగా ఉండి.. సైడ్ వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

హుజూరాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఉన్న ఎస్సారెస్పీ కాలువ పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వంతె నలు ఇరు కుగా మారడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వంతెనలకు ఇరువైపులా దెబ్బతిన్న సైడ్ వాల్స్

మండలంలోని కొత్తపల్లి, తుమ్మనపల్లి, ఇప్పలనర్సింగాపూర్, సైదాపూర్ రోడ్డు, కేసీ క్యాంపు వద్ద, పెద్దపాపయ్యపల్లి గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ కాలువపై చాలా ఏళ్ల క్రితం వంతెనలు నిర్మించారు. వాటికి ఇరువైపులా సైడ్‌వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీళ్లు నిండుగా పారుతుండగా, సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కానరాని సూచికలు :

ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన వంతెనల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై మూడు చోట్ల ఉన్న వంతెనలు పూర్తిగా ఇరుకు గా మారాయి. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనల సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే భారీ వాహనదారులు నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెన సైడ్‌వాల్స్‌కు మరమ్మతులు చేయించి, వంతెనల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరంగా మారింది



\- భాషవేని రాజేష్‌యాదవ్, వాహనదారుడు, సింగాపూర్

తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా మారింది. దీనికి తోడు బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండటంతో సామర్థ్యానికి మించి లోడుతో లారీలు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో ఈ బ్రిడ్జి సమీపంలో వీధి దీపాలు సైతం లేకపోవడం, బ్రిడ్జి సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతి

- ఖోఖోలో విశ్వ విజేతలుగా భారత జట్లు
- మహిళల జట్టుకు కోచ్‌గా జిల్లా వాసి


భారత జట్టుకు సూచనలు ఇస్తున్న నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: గ్రామీణ క్రీడ ఖో-ఖోకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. పల్లెల్లో, పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులు ఆడుకునే ఖో-ఖో ఆటలో మహిళలు, పురుషుల విభాగాలలో మన జట్లు విశ్వవిజేతలుగా నిలిచాయి. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు డిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్


ప్రపంచ కప్‌ను ముద్దాడుతున్న కోచ్ నరేష్

ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచకప్ పోటీల్లో 23 దేశాలు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన మహిళల ఫైనల్స్ మ్యాచ్‌లో భారత జట్లు నేపాల్ జట్లతో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసి తొలి ప్రపంచకప్‌ను తన ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో భారత జట్టు నేపాల్‌పై 54-36 పాయింట్ల తేడాతో గెలుపొంది ప్రపంచకప్‌ను ముద్దాడింది. ప్రపంచ చాంపియన్‌గా భారత్‌ను నిలపడంలో ఉమ్మడి కరీంనర్ జిల్లా ధర్మారం బంజరుపల్లి తండావాసి ఇస్లావత్ నరేష్ ముఖ్య భూమిక పోషించారు. నరేష్ భారత మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 30 రోజులపాటు శిక్షణను అందించి భారత్‌ను ప్రపంచ చాంపియన్‌గా నిలిపాడు.

● ఖో-ఖో మహిళల జట్టు కోచ్ ఇస్లావత్ నరేష్ నేపథ్యం

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఖో-ఖోలో భారత మహిళల జట్టు ప్రపంచ కప్ గెలవడంలో ధర్మారం మండలం లంబాడితండా (బి)కు చెందిన ఇస్లావత్ నరేష్ కీలక పాత్ర పోషించారు. ఖో-ఖోలో అద్భుత ప్రతిభ చూపి భారత్ మహిళల జట్టు కోచ్‌గా నియమి తులయ్యారు. ఆయన శిక్షణలో రాటుదేలిన జట్టు ప్రపంచ చాంపిన్‌గా నిలిచింది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడితండా (బి) గ్రామానికి చెందిన ఇస్లావత్ రూపానాయక్-సాంతారీల కుమారుడు ఇస్లావత్ నరేష్. వీరిది ఓ సాధారణ వ్యవసాయ కుటుంబం. నరేష్‌కు చిన్ననాటి నుంచి ఆటలంటే మక్కువ. హుస్నాబాద్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకున్న ఆయన ఖో-ఖోలో పలు పథకాలు సాధించారు. 2006లో రైల్వే శాఖలో సౌత్ సెంట్రల్ నాందేడ్ డివిజన్‌లో ఉద్యోగం సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన రైల్వే శాఖ తమ జట్టుకు 2016లో కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణ తీరును గమినించి స్పోర్ట్స్ ఫెడరేషన్ నరేష్‌ను ప్రపంచ కప్‌లో భారత మహిళా జట్టుకు కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణలో రాటు దేలిన క్రీడాకారులు ప్రపంచ చాంపియన్లుగా నిలిచారు.

ఖో-ఖోతో ఉజ్వల భవిష్యత్తు


- ఇస్లావత్ నరేష్, భారత మహిళల జట్టు కోచ్

ఖో-ఖో క్రీడతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఈ క్రీడతో పలు సంస్థలు ఉద్యోగావ కాశాలు కల్పిస్తున్నాయి. ప్రపంచ చాంపియన్లుగా నా శిక్షణలో భారత జట్టు నిలిచింది. 2027లో ఇంగ్లాండ్‌లో ప్రపంచ కప్ వరకఉ చీఫ్ కోచ్‌గా ఎదగాలనుకుంటున్నాను.

ఖో-ఖోకు ఒలింపిక్స్‌లో స్థానం కల్పించాలి..


- పై మహేందర్‌రావు, ఖో-ఖో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖో-ఖో క్రీడకు ఒలంపిక్స్‌లో స్థానం కల్పించాలి. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్లు పది సంవత్సరాలుగా విశేష ప్రతిభ చాటుతున్నాయి. భారత ఖో-ఖో జట్టు కోచ్‌గా మన జిల్లాకు ఎందిన నరేష్ వ్యవహరించడం మనందరికీ గర్వకారణం.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..


- నవీన్‌రాజ్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు

తొలి ప్రపంచకప్ ఖో-ఖో పోటీల్లో భారత్ మహిళల, పురుషుల విభాగాల్లో చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వచ్చే ప్రపంచకప్ పోటీల్లో స్థానం సాధించేందుకు నేను ఇప్పటి నుంచి తీవ్రంగా కృషి చేస్తాను. ఖో-ఖో అంతర్జాతీయ స్థాయికి చేరవడం ఆనందంగా ఉంది.

భారత జట్లకు అభినందనలు....


- గజ్జల భవాని, జాతీయ క్రీడాకారిణి

ప్రపంచ ఖో-ఖో పోటీల్లో భారత జట్లు చాంపియన్లుగా నిలవడం ఆనందంగా ఉంది. మహిళలు, పురుషుల జట్లకు అభినందనలు. గతంలో ఖో-ఖో జాతీయ క్రీడగా మాత్రమే ఉండేది. ఇప్పుడు 23 దేశాలు ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

ఆర్టీసీకి సంక్రాంతి జోష్

- కరీంనగర్ రీజియన్ పరిధిలో రూ.24.71 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కరీంనగర్ రీజియన్ పరిధిలో 24.71 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల పరిధిలో ఈ నెల 7వ తేదీ నుంచి 19 వరకు (13, 14తేదీలు మినహాయించి) ఆయా రూట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర వేసింది. ఇందులో జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ఎక్కువ బస్సు సర్వీసులు నడిపారు.

డిపోల వారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (కోట్లలో)	కిలోమీటర్ల (లక్షల్లో)	ఈపీకే	ఓఆర్	ప్రయాణికులు (లక్షల్లో)
గోదావరిఖని	3.69	6.01	61.43	98	7.53
హుస్నాబాద్	1.37	2.46	55.69	98	3.60
హుజూరాబాద్	1.75	2.88	60.80	107	4.12
కరీంనగర్-1	2.70	5.21	51.83	78	5.48
కరీంనగర్-2		3.16	6.36	49.72	80 4.38
మంథని	1.49	2.59	57.45	92	2.54
జగిత్యాల	3.18	5.58	57.08	89	6.33
కోరుట్ల	1.90	2.99	63.38	100	3.74
మెట్‌పల్లి	1.79	2.86	62.74	101	3.86
సిరిసిల్ల	1.84	3.04	60.50	100	3.83
వేములవాడ	1.83	3.23	56.61	94	3.59
రీజియన్	24.71	43.21	57.18	92	48.99

సిబ్బంది సహకారంతో..

- బి.రాజు, ఆర్టీసీ ఆర్ఎం



సంక్రాంతి పండగ సందర్భంగా ఆయా రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. సిబ్బంది సహకారంతోనే ఇంత ఆదాయం పొందగలిగాం. రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసిన అధికారులతో పాటు సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు. సంస్థపై ఇదే ఆదరణను కొనసాగించాలని కోరుతున్నాం.

రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా కరీంనగర్

- ద్వితీయ స్థానంలో వరంగల్
- మహబూబ్‌నగర్‌కు తృతీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు సోమవారం


చాంపియన్స్ ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా జట్టు

ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు వరంగల్‌పై 18-16 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, ఆదిలాబాద్ నాలుగో స్థానంలో నిలిచాయి. కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. డీఆర్‌వో పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ జిల్లాల కార్యదర్శులు శంకర్, ఎడ్ల ప్రవీణ్ కుమార్, సిరికొండ శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, హనుమంతు, రమే ష్, వీర్‌పాల్, దిలీప్ పాల్గొన్నారు.

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు'ను విజయవంతం చేయాలి

- బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న


సమావేశంలో దరువు వేస్తున్న అంజన్న

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఏర్పాటు చేసిన వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేయాలని చెప్పినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి నాలుగు నెలల క్రితం ప్రకటించి తప్పడంతో మరో ఉద్యమం చేయక తప్పడం లేదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాలె శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, భోనగిరి కిషన్, రాచకొండ రోజా, నక్క సతీష్, కొల్లూరి సురేందర్, రాపర్తి రవి, బండ పల్లి మల్లీశ్వరి, భోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి

- రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ఆందోళన


పోస్టుకార్డును ప్రదర్శిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని సోమవారం కోరుట్ల పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపి పోస్టు కార్డు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు పోస్టు కార్డులను పంపించారు. ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీని తపాల కార్యాలయం వరకు నిర్వహించి పోస్టు కార్డును పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాష్‌రావు, పబ్బా శివానందం, గంటేడి రాజ్‌మోహన్, యాకుబ్, నల్లాల లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, రాజయ్య, చిలుక గంగారాం, స్వామి, రాజేశ్వర్, లక్ష్మీకాంతం, మల్యయ్య, గోపాల్, శ్రీరాములు, సాబితలీ, నారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.6300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుల్తానాబాద్ కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం సంప్రీత్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో సంప్రీత్ ప్రతిభను చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ లో జరుగునున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నారు. సంప్రీత్‌ను అభినందించారు.

● ఓపెన్ చదరంగ పోటీల్లో విశాల్ ప్రతిభ

ఎలిగేడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో ఈనెల 19న జరిగిన ఇండియా ఓపెన్ చదరంగం పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపెల్లి విశాల్ ప్రతిభకనబరిచాడు. ఓపెన్ విభాగంలో 7రౌండ్లకు గాను 5రౌండ్లు గెలిచాడు. విశాల్‌కు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణరావు చేతులమీదుగా నగదు బహుమతి ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు ఆర్గనైజర్ నందకిషోర్, వెంకటగిరి, సీనియర్ కోచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

17వ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు స్విమ్మింగ్ శిక్షణ


శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్

ముస్తాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం రోజున 17వ బెటాలియన్ కమాండెంట్ గంగారాం ఆధ్వర్యంలో బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు ఈత పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు (ఎస్‌డిఆర్ఎఫ్) రాష్ట్రంలో విపత్తు నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనే బెటాలియన్ పోలీసులకు ఈతలో ప్రావీణ్యం కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంభవించే విపత్తు నివారణ చర్యలలో వీరంతా పాల్గొనడానికి ముందస్తుగా శిక్షణ ఇప్పించామని బెటాలియన్ కమాండెంట్ గంగారాం తెలిపా రు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, రమేష్, ఎస్ఐ నరేష్, సంతోష్, శ్రీధర్, 150 మంది బెటాలియన్ కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

భక్తజన సంద్రం... రాజన్న క్షేత్రం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- దర్శనానికి నాలుగు గంటల సమయం

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కొమరవెళ్లి మల్లన్న వారంపట్నంను పురస్కరించుకుని వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవా యితీ. ముందుగా కల్యాణకట్టలతో తలనీలాలు సమర్పిం చుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో


రాజన్న ఆలయ ఆవరణలో తనిఖీలు చేస్తున్న భద్రత సిబ్బంది

నాలుగు గంటలపాటు నిరీక్షించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మ వారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించు కున్నారు.

● బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు..

రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జిల్లా బాంబ్, డాగ్ స్క్వాడ్ టీం సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ స్థలాలు, వసతిగదులతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

● స్మార్ట్ టీవీల ఏర్పాటు..

రాజన్న ఆలయంలో నిర్వహించే పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయానికి వచ్చే భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పలు ప్రాంతాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ లడ్డుల కౌంటర్, కోడెమొక్కు క్యూలైన్‌లతో పాటుగా పలు ఓపెన్ స్థలాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయగా రాజన్న ఆలయంలో భక్తులు ఎక్కువగా ఉండే స్థలాల్లో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భారీ ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు


హరికథను చెబుతున్న భాగవతరాణి నాగరాణి

● ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి, నాగరాణి, శ్రీరాంభట్టర్ వేర్వేరుగా తమ హరికథతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం వైలెన్ సోలో కచేరి వినయకృష్ణ చేపట్టగా నరహరి, సతీష్ ఆధ్వర్యంలో సంగీత కచేరిని నిర్వహించారు. రతన్‌కుమార్ బృందం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..

త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలను సోమవారం ప్రారంభించి కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 72 సంవత్సరాలుగా వేములవాడ రాజన్న ఆలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న రతన్ కుమార్ బృందం

ఐక్యతతో అభివృద్ధి సాధ్యం

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యాదవుల ఐక్యతతోనే యాదవుల అభివృద్ధి సాధ్యమని యాదవ సంఘం అడహక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. సోమవారం రాయికల్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించి యాదవుల ఐక్యత, సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ యాదవ సంఘం సభ్యులు సభ్యత్వం తీసుకోగా సభ్యత్వ రశీదులను అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదనవేని రాజలింగం యాదవ్, మ్యాకల మహేష్ యాదవ్, దానవేని మల్లేష్, అనిల్, మల్లయ్య, గంగాధర్, లక్ష్మి, రాజు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ఈ నెల 24న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్ అన్నారు. మండలంలోని రాజనగర్ గ్రామంలో ఆయన పర్యటించారు.

చెక్కుల పంపిణీ

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి అందించారు. 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. పట్టణం బీఆర్ఎస్ పార్టీ ప్రదాన కార్యదర్శి గుడ్ల మనోహర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

●మెట్‌పల్లి రూరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. సోమవారం పట్టణం, మండలంలోని 12 మంది లబ్ధిదారులకు మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి తాగు నీటి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పలు వార్డులో రూ 15 కోట్ల టీయుఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో రెండు ప్రధాన సమస్యలు నెలకొన్నట్లు తెలిపారు. పవిత్ర గోదావరి నదిలో మురికి నీరు కలిసి గోదావరి కలుషితం కావడం, ఫ్లడ్ వాల్ లేక పోవడం వల్ల వర్షాకాలంలో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోదావరి నదిలో మురికి నీరు కలువకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు కోసం రూ 17 కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుక వెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన వివరించారు. ధర్మపురి నియోజకవర్గానికి ఎంపీ నిధులు రూ 5 కోట్లు వచ్చాయని, ఎంపీ వంశీకృష్ణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ధర్మపురి పట్టణంలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు ఉన్నా నీటి సమస్యను పరిష్కరించడంలో విఫలం అయ్యిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం పట్టణంలో ప్రజలకు 15 లక్షల లీటర్ల తాగు నీరు అవసరం ఉందని ఆయన అన్నారు. కేవలం 10 లక్షల లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో అమృత్ జల్ పథకం కింద రూ 22 కోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నట్లు ఆయన వివరించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి, ఎంపీ వంశీకృష్ణకు వార్డుల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు సంగనభట్ల సంతోషి, జక్కు పద్మ, వేముల నాగలక్ష్మి, గరిగె అరుణ, పురాణపు కిరణ్మయి, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, పబ్లిక్ హెల్ అండ్ మున్సిపల్ ఎస్ఈ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ సాలియా నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు అప్పం తిరుపతి పాల్గొన్నారు.

●ధర్మపురి పట్టణంలోని పలు వార్డులో రూ 15 కోట్ల టీయుఐఎఫ్‌డీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 3, 7, 11, 12 వ వార్డులో అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన చేశారు. సాయిబాబా గుడి, పాత పోస్టాఫీస్, కూరగాయల మార్కెట్, ఆంగ్లోవేదిక్ స్కూల్, మూలబండ వద్ద సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. పలు వార్డుల్లో నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు, పొడవు విద్యుత్ వైర్లు ఏర్పాటు కోసం శంకుస్థాప చేశారు.

పురపాలికలకు నిధులు విడుదల

5వ పేజీ తరువాయి..

మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలకు కలిపి రూ.కోట్లలో మంజూరయ్యాయి.

●గతంలో 4 శాతం నిధులు..

స్టాంపులు, రిజిస్ట్రేసన్ శాఖ నుంచి స్టాంప్ డ్యూటీని గతంలో 4 శాతం స్థానిక సంస్థల ఖాతాల్లో నేరుగా జమ చేసేవారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరు వాత ఈ నిధులను మున్సిపాలిటీలకు ఇవ్వకుండా ప్రభుత్వం నేరుగా తీసుకుంది. ఆ తర్వాత పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి పేరుతో ప్రతినెలా కొన్ని నిధులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది. వీటితో ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాలను నిలిపివేశారు. నిధులు లేక మున్సిపాలిటీల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటికే పనులు చేసిన కాంట్రాక్టర్లకు సైతం బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇటీవల కొన్ని పట్టణ ప్రగతి నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొంత మేర నిధులను మున్సిపాలిటీ ఖాతాల్లో జమ చేసింది.

●వేతనాలు, కరెంటు బిల్లులకే..

ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్టాంప్ డ్యూటీ బకాయిలను విడుదల చేయడంతో పాటు వాటి వినియో గానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేత నాలు, కార్యాలయాల కరెంట్ బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వార్డుల్లో సీసీరోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియో గించొద్దని స్పష్టం చేసింది.

మార్గదర్శకాల ప్రకారం వినియోగం



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి స్టాంప్ డ్యూటీ డబ్బులు విడుదల చేసింది. అయిదేళ్లకు సంబంధించిన నిధులు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఈ నిధులను ఖర్చు చేస్తున్నాం. పెండింగ్ విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలు చెల్లిస్తున్నాం.

-మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణతంత్ర వేడుకలకు ఘనంగా నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ బీమ్‌రావులు అధికారులను ఆదేశించారు.సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా చూసుకోవాలన్నారు. ప్రోటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్‌డీఓ మధు సూదన్, డీఆర్‌డీఓ రఘువరన్, కలెక్టరేట్ ఏఓ హన్మంతు రావు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

సారంగాపూర్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన గొల్లపెల్లి గంగయ్య అనే వ్యక్తి క్యాన్సర్‌తో బాధపడుతుండగా మడేలేశ్వర హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న సభ్యులు ముందుకు వచ్చి రూ.5 వేలు అందించారు.

పరామర్శ

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణానికి చెందిన గరిపెల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. ఆయన వెంట జగిత్యాల బిజెపి నియోజకవర్గం ఇంచార్జి బోగ శ్రావణి పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుంకె నరేష్ తల్లి సత్తమ్మ సోమవారం మృతి చెందటంతో మృతురాలి కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా. రవీంధర్ పాడిరైతులకు సూచించారు. సోమువారం గొల్లపల్లి మండలం అగ్గిమల్ల, ఇస్రాజ్ పల్లె గ్రామాల్లో జిల్లా పశుగణాభివృద్ధి, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా పశువైద్యులు డా. రవీంధర్, డా. తిరుపతి గౌడ్ పశువులకు గర్భకోశ వ్యాధి, చుడీ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు డా. రవీంధర్, డా. తిరుపతి, సూపర్‌వైజర్ షాదుల్లా గోపాల మిత్రలు శ్రీకాంత్, రవీంధర్, నరహరి, రాంరెడ్డి, అంజయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలని ఎమ్మెల్సీకి వినతి

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సారెస్పీ నీటితో చెరువులు నింపాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డికి గ్రామానికి చెందిన రైతులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఇటిక్యాల గ్రామ రైతుల సాగుకు ఆధారమైన చింతల చెరువు, లక్ష్మి సాగర్ చెరువుల్లో నీరు అడుగంటడంతో ఇటు వ్యవసాయానికి సాగు నీరు అందకపోవడంతో పాటు భూగర్భ జలాలు తగ్గిపోయి నీటి ఎద్దడితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సానుకూలంగా స్పందించిన జీవన్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులు నారాయణ రెడ్డి, భాస్కర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. డి-49, డి-50 తూముల ద్వారా చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని సూచించారు. జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ భాస్కర్, ఏఈ వినయ్‌లు ఇటిక్యాలలోని చెరువులను పరిశీలించారు. త్వరలోనే నింపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రైతులు ఏలేటి జలందర్ రెడ్డి, కొక్కెర చంద్రశేఖర్, అంతడుపుల లక్ష్మణ్, ఏలేటి రాజరెడ్డి, సోమ సాగర్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న రైతులు

ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలి

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని ఎస్సీ కులాల న్యాయబద్ధమైన వర్గీకరణ అమలు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షుడు వేట భాస్కర్ కోరారు.

జగిత్యాల ప్రెస్ క్లబ్ ఆవరణలో సోమవారం ఈ నెల 29న తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్‌లో నిర్వహించనున్న ఉద్యమకారుల సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ జేఏసీ, టీఏవైఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లారెడ్డి, కొంగర పవన్, భూమాల రాజ్ కుమార్, శెట్టి గంగారెడ్డి, గజ్జల రాజు, సాహెబ్, మమ్మద్ షేక్, ఎనుగంటి మోహన్, శనిగారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రేషన్‌కార్డుల సర్వే పరిశీలన

మల్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మల్యాలలో సోమవారం సర్వేను రేషన్‌కార్డుల సర్వేను అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హుల జాబితాను గ్రామ సభలలో తెలుపాలని సూచించారు. తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, ఈవో శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్

కొడిమ్యాల, జనవరి20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షునిగా దోమకొండ ఉదయ్‌కుమార్ సోమవారం సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా బండపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ జలెందర్, కోశాధికారిగా బండపెల్లి స్వామి, సంయుక్త కార్యదర్శి లింగాల లక్ష్మీరాజంతో పాటుగా ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తెలిపారు.

రాజ్యాంగం అత్యంత పవిత్రమైనది

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) భారత రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజక వర్గం ఇంచార్జి బోగ శ్రావణి అన్నారు. సోమవారం బీజేపీ సంవిదాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు యాదగిరి బాబు, రగిల్ల సత్యనారాయణ, జుంబర్తి దివాకర్, గుంటుక సదానందం తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

కథలాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

స్కూల్ వాహనాల తనిఖీ

మల్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల వాహనాలను సోమవారం ఎస్సై నరేశ్‌కుమార్ తనిఖీలు చేశారు. అనంతరం పాఠశాలల డ్రైవర్లకు రోడ్డుపై వాహనాలు నడపడం, భద్రత చర్యలపై అవగాహన కల్పించారు.

'కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలి'

మల్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇళ్లు ముట్టడించిన యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మల్యాలలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, ముత్యంపేట మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు

శ్రీరాములపల్లెలో ప్యాక్స్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

గొల్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి రైతులు సోమవారం వినతి పత్రంను సమర్పించారు. కార్యక్రమంలో తాండ్ర సురేందర్, బోయపోతు గంగాధర్, లంబ లక్ష్మణ్, గుండేటి తిరుపతి రెడ్డి, సల్లూరి శోభన్ గౌడ్, శ్రీకోటి రఘుపతి, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

కార్యాలయం ఏర్పాటు చేయాలి

ధర్మపురి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో పాత పోస్టాఫీస్ స్థలంలో నూతన కార్యాలయం ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వడంతో పాటు ప్రతి విద్యార్థికి రూ.25 మెనూ ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల మండల విద్యాధికారికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేష్ మాట్లాడుతూ రూ.5 చెల్లిస్తుందని, రూ.3 నష్టంతో మధ్యాహ్న భోజనం కార్మికులు విద్యార్థులకు కోడిగుడ్లు అందించలేరన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు లేనందున రెండు కూరలతో భోజనం పెట్టలేరని అన్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతో పాటు తొమ్మిది నెలలుగా ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శారద, బి.లక్ష్మి, మల్లేశ్వరి, కె.లక్ష్మి, జరీనా, లత, రాధ, రజిత తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి) : మార్కెట్ ధరలకు అనుగుణంగా కొడిగుడ్డు ధరలు, పెంచాలని అదే విధంగా 10 వేల వేతనం చెల్లించాలని కోరుతూ మధ్యహ్న బోజన వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వారానికి మూడు సార్లు కొడిగుడ్డు ఇవ్వాలని ఆదేశించిందని కాని ప్రభుత్వం గుడ్డుకు 5 రూపాయలు చెల్లిస్తుందని ప్రస్తుతం గుడ్డు ధర 8 రూపాయలు ఉందని దీంతో అదనంగా 3 రూపాయలు నష్టపోతున్నామని మార్కెట్ ధరలకు అనుగుణంగా చెల్లించాలని కోరారు. ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేయాలని కోరారు.

తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు ఈసందర్భంగా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి ఉస్మాన్, మధ్యహ్న భోజన యూనియన్ నాయకులు సులోచన, సరస్వతి, లావణ్య, గంగు, శారద, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

జగిత్యాలరూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ అన్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట శివారులోగల నేషనల్ హైవే ధర్మపురి రోడ్డులో సైన్ బోర్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గొల్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె మాజీ సర్పంచ్ శనిగారపు మల్లేశం తల్లి ఇటివల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. గజ్జెల అంజయ్య అనే నిరుపేద కూలీ అనారోగ్యంతో బాధపడుతుండగా లక్ష్మణ్ కుమార్ పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగితెలుసుకున్నారు.

ఆసుపత్రికి వాటర్ కూలర్ అందజేత

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన వ్యాపారవేత్త ఎంఏ రాహుఫ్ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వాటర్ కూలర్ ఏర్పాటు చేయ్యగా లయన్స్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మహేందర్, శ్రీగద్దె, నరేంద్ర, కోమ్ముల జీవన్ రెడ్డి, గుంటుక చంద్రప్రకాష్, అడెపు మధు, చాప కిశోర్, గుంటుక సురేష్ బాబు, మంచాల జగన్, దండమరాజు స్వరాజు, దుబాయి శ్రీనివాస్, ఏలేటి లక్ష్మారెడ్డి, పిడుగు గుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

బీర్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో మంగళవారం నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. 21 మంగళవారం తుంగూర్ గ్రామ సభ తహసీల్దార్ తాజిబుద్దిన్, చిత్రవేణిగూడెం గ్రామంలో ఎంపీడీవో లచ్చాలు, చెర్లపెల్లి గ్రామంలో పంచాయతీ రాజ్ ఏఈ విశ్వేశ్వర్ రావ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు జరుగనున్నాయి. 22 బుధవారం రోజునా కండ్లపెల్లి, రేకులపెలి గ్రామాలల్లో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, తాళ్ళధర్మారం గ్రామంలో ఎంపీడీవో లచ్చాలు, బీర్‌పూర్, నర్సింహులపలి గ్రామాలల్లో తహసీల్దార్ తాజిబుద్దిన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించగా, 23 గురువారం రోజునా కందెనకుంట, మంగేళ గ్రామాలలో ఎంపీడీవో లచ్చాలు, కొల్వాయి గ్రామంలో తహసీల్దార్ తాజిబుద్దిన్, కమ్మునూర్ గ్రామంలో పంచాయతీ రాజ్ ఏఈ విశ్వేశ్వర్ రావ్‌ల ఆధ్వర్యంలో సభలు జరుగనుంది. 24 నాడు చిన్న కొల్వాయి, కోమన్‌పెల్లి గ్రామాల్లో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, రంగసాగర్ గ్రామంలో పంచాయతీ రాజ్ ఏఈ విశ్వేశ్వర్ రావ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు జరుగుతాయన్నారు.

●కొడిమ్యాల : మండలంలో మంగళవారం నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇ. స్వరూప తెలిపారు. ఎంపీడీవో సోమవారం విలేకరులతో 21న శనివారంపేట, దమ్మయ్యపేట, చింతలపల్లి, నర్సింహులపల్లి, తురుకకాశీనగర్, రాంసాగర్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న హిమ్మతురావుపేట, కొండాపూర్, గౌరాపూర్, కొడిమ్యాల, 23న తిర్మాలాపూర్, రామకిష్టాపూర్, సూరంపేట, తిప్పయ్యపల్లి, అప్పారావుపేట, నాచుపల్లి, పూడూర్, 24న చెప్యాల, నల్లగొండ, శ్రీరాములపల్లి, గంగారాంతండా, డబ్బుతిమ్మయ్యపల్లి, కోనాపూర్, నమిలికొండ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

●వెల్గటూర్: మండలం లోని ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. 21న చెర్లపల్లి, గొడిశెలపేట, శానబండ, కిషన్‌రావుపేట, పడ్కల్, కుమ్మరిపల్లి, స్తంభంపల్లి, రాంనూర్ చెగ్యాం, కొండాపూర్, 22న గుల్లకోట, పాతగూడూర్, సూరారం, కప్పారావుపేట, తాళ్లకొత్తపేట, కోటిలింగాల, పాషిగామ, జగదేవ్‌పేట, 23న రాజారాంపల్లి, సంకెనపల్లి,అంబారిపేట, వెంకటాపూర్, ముక్కట్రావ్‌పేట, రాజక్కపల్లి, శాఖాపూర్, 24న ఎండపల్లి, ముత్తునూర్, కొత్తపేట, వెల్గటూర్, పైడిపల్లి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

●మల్యాల: మంగళవారం నుంచి మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు.

●రాయికల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలల్లో లబ్ధిదారు గుర్తింపునకు నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు రాయికల్ ఎంపీడీవో సోమవారం తెలిపారు. మండలంలోని మంక్యా నాయక్ తండా, చెర్లకొండాపూర్, ఉప్పుమడుగు, శ్రీరాంనగర్, వస్తాపూర్, తాట్లవాయి, కైరి గూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ నెల 22న రాజ్‌నగర్, సింగర్రావుపేట, కట్కాపూర్, ఆల్యానాయక్ తండా, 23న కిష్టంపేట, అయోధ్య, జగన్నాథ్‌పూర్, దర్మాజీపేట, 24న అల్లీపూర్, కుర్మపల్లి, దావన్‌పెల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

రాయికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై జరిగిన దాడిని ఖండిస్తూ రాయికల్ మండలంలోని మైతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముక్కాల మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: కొడిమ్యాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ప్రణీత, టీఎస్ఎస్‌టీఏఫ్ జిల్లా సభ్యులు రమణ, తబుస్సుం, విజయకుమార్, మల్లేశం, రాజేశం, శ్రీధర్, టీఎస్‌టీఏఫ్ మండల అధ్యక్షుడు నిసాని మహేందర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన జంగ లస్మయ్యభూమక్క దంపతులు 25వేల 116 రూపాయల నగదును అందించినట్లు ఆలయ పూజారి నాగరాజు రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం అందజేత

భీమారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రానికి ఇరువురికి సింగిరెడ్డి దోసిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చేయూతనందించారు. మండలకేంద్రానికి చెందిన సుంకపాక అర్జవ్వ, బక్కూరి బొర్రయ్య కుటుంబాలకు సోమవారం 50 కిలోల బియ్యం చొప్పున బియ్యం అందజేశారు. వీరి వెంట మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, తేలు నరేష్, చెక్కపెల్లి సంజీవ్, చెక్కపెల్లి శంకర్, బొమ్మెన ప్రశాంత్, ఉత్కం శంకర్ పాల్గొన్నారు.

నియామకం

భీమారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమారం చైతన్య కాపు సంఘం నూతన అధ్యక్షునిగా బద్దం రాఘవ రెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా పుప్పాల బుచ్చిరెడ్డి, కోశాధికారిగా చెక్కపెల్లి మురళి, సలహాదారులుగా కనుక ఉషన్న, చెక్కపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.